క్లుప్తంగా

ఆధార్ కష్టాలు



ఆధార్ కేంద్రం వద్దకు తరలివచ్చిన జనం

సైదాపురం: మండలంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాలకు వందలాది మంది విచ్చేస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోజుకు 20కి మించి ఆధార్ కార్డుల వివరాలు సేకరించలేక పోవడంతో వచ్చిన వారు అంతా వెనుతిరిగి పోవాల్సి వస్తోంది. గిద్దలూరు, ఊటుకూరు గ్రామాల నుంచి వచ్చిన జనం ఇబ్బందులు పడుతున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్ల ఆవిష్కరణలో నాయకులు

కోట: మండల కేంద్రంలో రాజ్యాంగం పరిరక్షణ యాత్రకు సంబంధించిన పోస్టర్లను శనివారం జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఆగస్టు 3 నుంచి ప్రారంభం కానున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ జేఏసీ నాయకులు మీజూరు మాధవ్, మల్లికార్జున్, హేమంత్, అశోక్ పాల్గొన్నారు.

ఇటుకల ట్రాక్టర్ బోల్తా

సూళ్లూరుపేట: మండలంలోని ఇలుపూరు పంచాయతీ పరిధిలోని పెరిమిటిపాడు సమీపంలో శనివారం సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి రోడ్డుపై ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడడంతో అందులో వున్న కూలీలు ముగ్గురికి గాయాలయ్యాయి. అయితే ఇటుకలు తీసుకుని పెరిమిటిపాడుకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఇటుకల లోడు మీదు కూర్చున్న కూలీలు ముగ్గురు ఇటుకల కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే అటుగా వెళుతున్న స్థానికులు స్పందించి ఇటుకలను తొలగించి గాయపడి వారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.

దాడిలో ఒకరికి గాయాలు

కోట: మండలంలోని చిట్టేడు మద్యం దుకాణం వద్ద జరిగిన దాడి ఘటనపై విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ శనివారం తెలిపారు. చిట్టేడుకు చెందిన మునిరత్నంపై అదే గ్రామానికి చెందిన ఆటో వంశీ, మునికృష్ణ దాడి చేయడంతో తలపై గాయాలైనట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

వెంకటగిరి రూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి, ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు, నునెగింజలు పోషకాధారిత, వ్యవసాయ, ఉద్యానపంటలపై అవగాహన కల్పించారు. అనంతరం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులు విడుదల సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని వీక్షించారు.

మా దాహార్తి తీర్చండి



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఎస్టీకాలనీ వాసులు

తిరుపతి అర్బన్: బాలాయపల్లి మండలం మన్నూరు ఎస్సీకాలనీ వాసులకు తాగునీరు ఇప్పించాలంటూ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. వారు శనివారం కలెక్టరేట్‌కు విచ్చేసి కలెక్టర్‌ను శాలువతో సత్కరించారు. వారు మాట్లాడుతూ ఎస్టీ కాలనీలో తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయలేదన్నారు. ఉన్న చేతిపంపులు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించండి. అంటూ కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. యానాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెంచు మల్లికార్జునరావు, చెంగల్‌రాయల్, అడివయ్య, రేవతి, రాములమ్మ, కల్పన, శ్రీను పాల్గొన్నారు.

చికెన్ ధరలు 03.8.2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	114
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	234
లేయర్ చికెన్	:	190

పేదల పరిహారం.. నేతలకు ఫలహారం

- అడ్వాన్స్ పేమెంట్‌తో భూపత్రాలు స్వాధీనం?
- అటవీ భూములనూ వదలని వైనం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం





శిరసనంబేడు గ్రామంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములు, తెలుగుగంగ కాలువ సమీపంలో కబ్జాలో ఉన్న అటవీ భూములు

పెళ్లకూరు: ఏపీఐఐసీకి కేటాయించిన భూముల పరిహారం కోసం ఇరవైయేళ్లుగా ఎదురు చూస్తున్న పేదల పరిహారాన్ని కూటమి నేతలు జేబుల్లో వేసుకోవడానికి కుట్రలు చేస్తున్నారు. భూపత్రాలు స్వాధీనం చేసుకోవడానికి అడ్వాన్స్ పేమెంట్ పేరుతో మాయమాటలు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే, మండలంలోని శిరసనంబేడు గ్రామంలో సర్వే నంబరు 287 నుంచి 334వరకు ఉన్న 200.96ఎకరాల భూములను గతంలో సెజ్‌కి కేటాయించారు. గడిచిన ఇరవైయేళ్లల్లో కేవలం ఒకే ఒక్క స్టీల్ పరిశ్రమ మాత్రమే ఏర్పాటయింది. అప్పటి నుంచి భూములు అప్పగించిన నిర్వాసితులు పరిహారం కోసం కళ్లకాయలు కాసేలా ఎదురు చూస్తూనే ఉన్నారు. అయితే ఇక్కడి పెత్తందారులు ఆ భూములను తారుమారు చేయడం, పట్టాదారు పేర్లు మార్చేయడం, పేదల భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలను అప్పుల పేరుతో లాక్కోవడం ఇలా ఎన్నెన్నో అక్రమాలను గుట్టుచప్పుడు కాకుండా సాగిస్తున్నారు. ఇక్కడ 176.96ఎకరాలు భూములను పేదలకు పట్టాలు మంజూరు చేసివుండగా 24.63ఎకరాలు మిగులు భూములున్నాయి.

అడ్వాన్స్‌పేమెంట్‌తో ఆశలు రేకెత్తిస్తూ...

పేదలకు మంజూరు చేసిన భూములను ఏపీఐఐసీకి కేటాయించడంతో కొందరు కూటమి నాయకులు, స్థానిక భూస్వాములు కుమ్మక్కై అమాయకుల కడుపుకొట్టే పనిలో నిమగ్నమయ్యారు. దశాబ్దాలుగా పరిహారం కోసం ఎదురు చూస్తున్న నిర్వాసితులను మాయమాటలతో మభ్యపెడుతున్నారు. శిరసనంబేడు, రాజుపాళెం ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేస్తూ, తక్కువ పరిహారం ఇస్తారని, అందువల్ల పట్టాలు, పాసుపుస్తకాలు అప్పగిస్తే ఒక ఎకరానికి రూ.10 లక్షలు చొప్పున ఇస్తామని, ప్రస్తుతం రూ.50 వేలు అడ్వాన్స్‌పేమెంట్ అందిస్తామంటూ చెబుతున్నారు. ఈ క్రమంలో కొనుగోలు చేసిన భూములను ఫ్రీహోల్డ్ తర్వాత రిజిస్ట్రేషన్లు చేసుకొనేలా ఒప్పందం చేసుకుంటున్నట్లు సమాచారం. పలువురు కూటమి నాయకులు చెన్నై నగరానికి చెందిన వ్యాపారులతో పావులు కదుపుతున్నారు. మరి కొందరు స్థానిక భూస్వాములు పేదల కష్టాలను ఆసరాగా చేసుకొని పట్టాదారు పాసుపుస్తకాలపై చిన్నచిన్న మొత్తాలను చెల్లించి ఇక్కడ భూస్వాములు పట్టాదారు పాసుపుస్తకాలను స్వాధీనం చేసుకుంటున్నారు. గ్రామంలో మిగిలివున్న 24.63ఎకరాల అనాదీన భూములకు బినామీ పేరుతో పట్టాలు మంజూరు చేసేలా కొందరు అధికార పార్టీ నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు.

అటవీ భూముల కబ్జా

మండలంలోని రోసనూరు, రాజుపాళెం, శిరసనంబేడు గ్రామాల సరిహద్దుల్లో తెలుగుగంగా 7వ బ్రాంచ్ కాలువ సమీపంలో ఉన్న అటవీభూములను అధికార పార్టీ నేతలు పదుల ఎకరాల్లో కబ్జా చేసి సాగుకు సిద్ధం చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నేత పేరు చెప్పుకుంటూ అటు అధికారులను, ఇటు సామాన్య ప్రజలను మభ్యపెట్టి అటవీ భూముల్లో భారీ యంత్రాలతో ముళ్ల పొదలు, చెట్లు తొలగించి సాగు భూములుగా మార్చేస్తున్నారు. నెల రోజులుగా అటవీ భూముల్లో యంత్రాలతో పనులు చేస్తున్నా ఇక్కడ రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు తమకు పట్టదన్నట్లుగా వ్యవహరిస్తుండడంపై స్థానికులు బాహాటకంగా విమర్శలు చేస్తున్నారు.

చట్టాలు ఉల్లంఘిస్తే చర్యలు

శిరసనంబేడు, రాజుపాళెం, తెలుగుగంగా కాలువ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో పెత్తందారులు రెవెన్యూ చట్టాలను ఉల్లఘించేలా వ్యవహరించి భూకబ్జాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు. పూర్తి స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

–హరికృష్ణ, తహసీల్దార్, పెళ్లకూరు

కండలేరులో 26 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 26.019 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,750, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 90, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

తాగునీరు వృథా



కొళాయి నుంచి వృథా అవుతున్న తాగునీరు

పెళ్లకూరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నీటి కొళాయిలు మరమ్మతులకు గురి కావడంతో తాగునీరు వృథా అవుతోంది. కార్యాలయ సిబ్బంది పట్టించుకోకపోవడంతో రోజంతా తాగునీరు వృథాగా పోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

పింఛన్ల పంపిణీ

నాయుడుపేటటౌన్: ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను శనివారం సూళ్లూరు పేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. పట్టణంలోని గాంధీపార్కు వద్ద జరిగిన కార్యక్రమంలో నాయుడుపేట అర్బన్, రూరల్, పెళ్లకూరు, ఓజిలి మండలాలకు సంబంధించి కొత్తగా మంజూరైన 410కిపైగా పింఛన్లను లబ్ధిదారులు అందించారు.

పెంచలకోనలో స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు





వైభవం.. శ్రీవారి కల్యాణం



విరాళం అందిస్తున్న పెంచల నరసింహులు కుటుంబసభ్యులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహాస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చరణలతో కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

లక్ష్మీనరసింహస్వామి నిత్య అన్నదాన పథకానికి నెల్లూరు జిల్లా చేజర్ల మండలం మందపల్లెకు చెందిన ముళ్లపుట్టి పెంచల నరసింహులు కుటుంబసభ్యులు రూ.1,01,116 నగదును విరాళంగా అందించినట్లు ఆలయ ఏసీ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాలు అందించినట్లు ఆయన వివరించారు.

త్రివర్ణ పతాక సృష్టికర్తకు ఘన నివాళి



పింగళికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

చిల్లకూరు: ప్రపంచ దేశాలు గర్వించేలా మూడు రంగుల జెండాను సృష్టించిన పింగళి వెంకయ్యను భారతీయులు మరువలేరని భారతీయ శిక్షణా మండలి సభ్యులు ప్రజేంద్రరెడ్డి తెలిపారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు త్రివర్ణ పతాకానికి సంబంధించి క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనుసూయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ సన్నారెడ్డి విజయలక్ష్మి

చిట్టమూరు: మండలంలో అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ సన్నారెడ్డి విజయలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలు చేరేలా చూడాలని కోరారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖ తరపున నివేదికలను సమావేశంలో వివరించారు.

అక్రమాలు అరికట్టాలి

మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య అధికారులను కోరారు. గ్రామాల్లో ఉపాధి పనులకు రాని వారి పేర్లను మస్టర్‌లో వేసి లక్షలాది రూపాయల ప్రజా ధనాన్ని కొల్లగొడుతున్నారని అధికారులను నిలదీశారు. సక్రమంగా పనికి వెళ్లిన వారికి మాత్రం కూలీ డబ్బులు పనికి తగ్గట్టు కాకుండా తక్కువ కూలీ ఇచ్చి పనులకు రాకుండా ఇంటి దగ్గర ఉన్న వారికి మాత్రం ఎక్కువ కూలి ఇవ్వడం దారుణమన్నారు. ఎంపీడీఓ మనోహర్ గౌడ్ సమాధానం ఇస్తూ పరిశీలించి అలా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మూడో తరగతి పిల్లాడికి అ, ఆలు రావడం లేదు

మండలంలోని కొన్ని పాఠశాలల్లోని 3వ తరగతి విద్యార్థులకు కనీసం అ, ఆలు కూడా రాయడం రావడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు చిప్పల వెంటకయ్య విద్యాశాఖాధికారులను సమావేశంలో నిలదీశారు. నేటి విద్యావ్యవస్థ మరీ దారుణంగా తయారైందన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుతో పాటు, ఇంగ్లీషును కూడా విద్యార్థులు అనర్గళంగా రాయగలిగేవారని, నేడు అలాంటి పరిస్థితుల్లేవన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య, జెడ్పీటీసీ సభ్యుడు చిప్పల వెంకటయ్య, ఎంపీటీసీలు సభ్యులు పకీరయ్య, పంచాయతీ సర్పంచ్‌లు, డీటీ నిరంజన్, ఇరిగేషన్ ఏఈ ఘని, ఎంఈఓ బీవీ కృష్ణయ్య పాల్గొన్నారు.

న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీలు





బీసీ రెసిడెన్షియల్ పాఠశాలను, వైద్యశాలను తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి విష్ణువర్మ

వెంకటగిరి రూరల్: వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం న్యాయమూర్తి విష్ణువర్మ పట్టణంలోని బీసీ బాలుర రెసిడెన్షియల్, ప్రభుత్వ వైద్యశాలలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మహాత్మజ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో వంట సామగ్రి, స్టాకు సరుకులు, వివరాలు తెలుసుకున్నారు. నాసిరకంగా ఉన్న కూరగాయలను చూసి అసహనం వ్యక్తం చేశారు. అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ మందుల కేంద్రం, ల్యాబ్ టెక్నీషియన్, ఎక్స్‌రే ప్లాంట్, రక్తపరీక్షల నిర్వహణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. న్యాయమూర్తి విష్ణువర్మ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అందించే వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని, కాలం చెల్లిన మందులు వినియోగించడం, ఒకరికి వేసిన సూది మందులను మరొకరికి వేస్తున్నట్లు ఫిర్యాదు అందిందన్నారు. వైద్యశాలలోని రోగులను అడిగి వైద్యసిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల లీగల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ రాజేష్, రాజాం, కిషోర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

సైదాపురం: పార్టీ బలోపేతానికి కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బీజేపీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు చోట్ల మొక్కలను నాటారు. రాష్ట్ర అధ్యక్షులు ఈ నెల 12న తిరుపతికి వస్తున్న సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఓబీసీ మోర్చ తిరుపతి జిల్లా అధ్యక్షులు బీకే గోపి ఆచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ ఛాన్‌బాషా, మండల బీజేపీ అధ్యక్షులు నరసింహ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి చర్యలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుబ్బారావు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు చేడుతున్నట్లు ప్రిన్సిపల్ సీవీ సుబ్బారావు వెల్లడించారు. గురుకులం వద్ద శనివారం ప్రిన్సిపల్ మీడియాతో మాట్లాడారు. గురుకులంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి బైపీసీ, ఎంపీసీతో పాటు 5వతరగతికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు నేరుగా గురుకులం వద్దకు వచ్చి స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల కోసం గురుకులంలో సంప్రదించాలని కోరారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన





దొరవారి సత్రం: మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోతికిరణ్, రాపూరు: మాట్లాడుతున్న సునందన

దొరవారిసత్రం: మండలంలోని ఎస్ఎం అగ్రహారం, వెదురుపట్టురాజుపాళెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు బిడ్డ తల్లులకు, గర్భవతులకు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతికిరణ్, సూపర్‌వైజర్ అంకమ్మ, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు

రాపూరు: తల్లి పాలు బిడ్డకు ఎంతో మేలు అని అంగన్ వాడీ ఐసీడీఎస్ సీడీపీఓ సునందన పేర్కొన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా రాపూరు మండలం గోనుపల్లి గ్రామంలోని అంగనవాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

బిడ్డకు మూడేళ్లవరకు తల్లిపాలు శ్రేష్టం

చిల్లకూరు: పుట్టినప్పటి నుంచి మూడేళ్ల వరకు బిడ్డకు తల్లి పాలు పట్టిస్తే ఎంతో మంచిదని ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబీ సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం చిల్లకూరు గ్రామంలోని దళితవాడ, వడ్డిపాళెం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇందిర, ప్రసన్న, పెంచలమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతపై అవగాహన

నాయుడుపేటటౌన్: తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని దాని విశిష్టతపై సీడీపీఓ ఉమామహేశ్వరి తల్లులకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని పండ్లూరు వెంగమాంబపురం, కల్లిపేడు, శ్రీనివాసపురం ఎస్టీ కాలనీలలోని అంగన్‌వాడీ కేందాల వద్ద శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలను 1వ తేదీ నుంచి ప్రాజెక్టు పరిధిలోని నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హేమలత, మణెమ్మ, సాయిలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

కలువాయి(సైదాపురం): మండలంలో కుల్లూరు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో కల్లూరు క్లస్టర్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగ్‌వాడీ కార్యకర్త తోట రామలక్ష్మి తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పెంచలమ్మ, శైలజ, ఆయాలు లక్ష్మి, సరిత, సునీత, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.








చిల్లకూరు : మాట్లాడుతున్న సీడీపీఓ మహబూబీ, నాయుడుపేట: మాట్లాడుతున్న సీడీపీఓ ఉమామహేశ్వరి, కలువాయి: వారోత్సవాల్లో అంగన్‌వాడీ సిబ్బంది

విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు

గూడూరురూరల్: విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలని, ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం సీపీఎం, సీపీఐ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలతో ప్రజలు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఇప్పుడు స్మార్ట్ మీటర్లను తీసుకొస్తోందన్నారు. దీంతో ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతారని, వెంటనే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని దుయ్యబట్టారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 11న విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు వెంకటరామిరెడ్డి, పుట్టా శంకరయ్య, పామంజి మణి, అడపాల ప్రసాద్, రమణయ్య, దారా కోటేశ్వరరావు, ఎంబేటి చంద్రయ్య, సీపీఐ నాయకులు ప్రభాకర్, శశికుమార్, రమేష్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి



పాత బస్టాండు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐలు

నాయుడుపేటటౌన్ : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్ఐ ఆదీలక్ష్మి, పీఎస్ఐ భాను ప్రసన్న సూచించారు. పట్టణంలో పలు కూడళ్ల వద్ద శనివారం వాహనాలను నిలిపి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎస్ఐలు మాట్లాడుతూ ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడపరాదని హెచ్చరికలు చేశారు. మైనర్లు వాహనాలు నడిపేతే అతనితోపాటు వాహన యాజమానిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే విధంగా వాహనాలను రోడ్డపై నిర్లక్ష్యంగా పార్కింగ్ చేయరాదని చెప్పారు. పలు కూడళ్ల వద్ద బైక్‌లు తదితర వాహనాలను తనిఖీలు చేపట్టి లైసెన్స్‌లు, ఆర్‌సీలు లేని వారికి జరిమానాలు విధించారు.